**ఒకవైపు బాధల బరువు మోయలేని కొడుకు. మరోవైపు బరువుబాధ్యతలను మోస్తున్న భర్త. ఇద్దరూ తనవాళ్ళే! అయితే, తను యే గుండె ముడిని విప్పగలదు!**

రాత్రి పదిగంట లయింది. రాఘవమ్మ కొడుకు పక్కలో పడుకొని చిన్నగా వాడ్ని తన దగ్గరకు లాక్కుంది! ఆ సమయంలో ఆమెకు కొడుకుమీద అణు వణువు, నరనరంలోనూ వున్న ప్రేమ ప్రవాహంలా పొంగి గుండెల నిండా నిండింది.

కొడుకు దగ్గరగాఉన్నా ఇంకా దూరంగా ఉన్నాడనిపించి మరింత దగ్గరకు లాక్కుంటూ "పిచ్చిబాబు" మొహంమీద ముద్దు పెట్టుకొని మొహం తడిమింది. 'ఊ' అంటూ అమ్మవైపుకు తిరిగి ఒక కాలు ఆమెమీద వేసి ఆమెను అంటుకుపోయినట్లే దగ్గరగా జరిగి మెడచుట్టూ చెయ్యివేసి పడుకున్నాడు ఎనిమిదేళ్ళ శ్రీనివాసు!

"శీనూ!" రాఘవమ్మ వాడి ఒళ్ళంతా నిమురుతుంటే కాలిమీద గదుములా చేతికి తగిలింది! ఆ స్థలం మీదనే నాలుగయిదు సార్లు నిమిరింది. అప్రయత్నంగాకళ్ళల్లో నీళ్లూరాయి! అలా నిమురుతుంటే ఆమెకు దిగులేసింది! "ఎన్నిదెబ్బలు తిన్నాడు పిచ్చిసన్నాసి! అయినా ఆయనకూడా ఒళ్లు మరిచి ఇంతలా కొట్టారేమిటి పసివాడ నయినా చూడకుండా? ఆయనకు వీడు పెద్ద ఆరిందాలా కనబడ్డాడు కాబోలు! చావబాదారు గొడ్డును బాదినట్లు బెల్టుతో!" రాఘవమ్మకు దుఃఖం ఉప్పెనలా వచ్చింది. కొడుకు చెయ్యి మరింత మెడచుట్టూ వేసుకొని ముద్దుపెట్టుకుంది.

ఆ లాలింపు సరిపోదనిపించింది ఆమెకు! "ఏదో చెయ్యాలి. వాడ్ని తృప్తి పర్చాలి. సంతోషపెట్టాలి. వాడి దిగులు మరిచేట్లు చేయాలి" అనిపించింది ఆ తల్లికి! వాడు పడిన బాధకు ప్రతిగా ఆ సమయంలో తన ప్రాణమైనా ఇవ్వాలనిపించింది.

"శీనూ" ప్రేమగా తట్టుతూ పిల్చింది! "ఊ" వాడు కాళ్ళు ముడుచుకొని పడుకొన్న తీరు రాఘవమ్మకు కడుపులో దేవినట్లయింది!

"ఏమైనా తింటావురా!" "ఊ!" అన్నాడేగాని శీను లేవలేదు. రాఘవమ్మకు ఏదో తపన. ఆరాటం! వాడికొరకు ఏదైనా చెయ్యాలి! వాడు అన్నీ మర్చిపోవాలి! సంతోషపడాలి" అనే మనస్సుతో కొట్టుమిటాడింది.

"నానీ! ఇలా చూడు కొంచెం పాలు తాగుతావా! సాయంత్రం తాగలేదుగా" వాడి జవాబు కొరకు చూడకుండా వాడిని సరిగా పడుకోబెట్టి నెమ్మదిగా లేచి వెళ్ళి గ్లాసులో పాలుపోసి పంచదార వేసుకు నొస్తూ, భర్త గదిలోకి తొంగిచూసింది! ఆయన ఏదో చదువుకుంటూ కూర్చున్నారు! రాఘవమ్మ పాలుతీసుకొని కొడుకుదగ్గరకువచ్చి 'శీనూ! ఈ పాలు తాగు' అంటూ వాడిని లేపి ఒక చేత్తో శీనుతలను పట్టుకొని మరోచేత్తోగ్లాసు పట్టుకొని వాడిచేత బలవంతంగా పాలు తాగించి మూతి తుడిచి పడుకోబెట్టింది.


"చాలా నానీ! ఇంకేమీ వద్దా! ఏం నాన్నా" మురిపెంగా, బాధగా అడిగింది.

"ఉహూ!" శీను మరల ముడుచుకొని పడుకొన్నాడు.

దుప్పటి సరిచేసి రాఘవమ్మ వాడి పక్కలోనే పడుకోవాలనుకుంది గాని, పక్క మంచంమీది చంటిది లేవడంతో "అబ్బబ్బ! యిదొకటి" విసుక్కుంటూవెళ్ళి పాపపక్కలో పడుకొంది. పాప పడుకోగానే లేచి కొడుకు దగ్గరకు వెళ్ళి వాడిని యెత్తుకొని తనమంచంమీద యిద్దరిమధ్యా యిరుక్కొని పడుకొంది. యిద్దరిమీదా చేతులువేసి! "ఏం చదువులో ఏవిటో! వెట్టివెధవ చచ్చే దెబ్బలు తిన్నాడు ఈ రోజు." ఆమెకు మరల దుఃఖం వచ్చింది. "కనీసం ఆయన కాస్త లాలనగా అడగకూడదూ! రావడం, రావడమే వాడి మీద విరుచుకుపడ్డారు! ఇంకా నయం టిఫినయినా తిన్నాడు" భర్తమీద బండెడు కోపం వచ్చింది. "అయినా ఆయనదేం తప్పు! ఆవేశంలో వీడు చేసిన పనికి ఎవరైనా అంతే చేస్తారు! అసలువీడెందుకు వెళ్ళడంలేదు ఇన్నాళ్ళ నుంచీ బడికి! దినమంతా ఎక్కడుంటున్నాడు. ఎలా గడపగలుగుతున్నాడు?" ఆలోచిస్తుంటే రాఘవమ్మకు అయోమయంతో భయం వేసింది కొడుకు సంగతి!

"ఇంకా నయం. వాడికేమీ జరగలేదు! వెట్టివెధవ ఎక్కడెక్కడ తిరిగి ఎన్ని బాధలు పడ్డాడో" మరింత జాలివేసింది కొడుకుమీద. అన్నాళ్ళు బడికి వెళ్ళకుండా చెడతిరిగినందుకు కోపం రాలేదుగాని, వాడికేమైనా అయితే అని భయం వేసింది!

"ఇంకా నయంఇప్పటికైనా తెలుసుకోకలిగాం. ఏవీ కాకముందే! ఆయన ఈ రోజు బడికి వెళ్ళడం మంచిదైంది!" రాఘవమ్మకు ఆ ఉదయం జరిగింది గుర్తుకొచ్చింది.



భర్తను పంపి, చంటిదాన్ని నిద్రపుచ్చి అన్నీ సర్దుకొని అన్నానికి కూర్చునేసరికి పన్నెండయింది రాఘవమ్మకు! అన్నం ముద్ద నోట్లో పెట్టుకోబొయ్యేసరికి హరి నారాయణ కందగడ్డలా మొహం పెట్టుకొని ఆఫీసుకు వెళ్ళకుండా యింటి కొచ్చాడు.

"ఏవిటీ ఆఫీసుకు వెళ్ళలేదా! లేట యిందా, ఒంట్లో బాగుండలేదా" అన్నం ముద్ద చేతిలోనే పట్టుకొని అడిగింది ఆత్రంగా!

ఆమె ప్రశ్నకు జవాబివ్వకుండా రెండు చేతుల్లోనూ తలపెట్టుకొని కుర్చీలో కూర్చున్న భర్తను చూస్తుంటే రాఘవమ్మకు భయంవేసింది. "ఏం జరిగింది" భర్త గంభీరత చూస్తుంటే ఆమెకు కదిలించడానికి భయంవేసింది! 'అసలేమైంది' అన్నంముద్ద కంచంలోవేసి లేచి భర్తదగ్గరకు వచ్చి, అతనేమైనా చెప్తాడేమోనని రెండు నిముషాలు నిలబడింది.

కాని హరినారాయణ వంచిన తల ఎత్తకుండా అలాగే కూర్చున్నాడు! భర్త సంగతి రాఘవమ్మకు బాగా తెలుసు! ఏమైనా జరిగినా, కోపం వచ్చినా అలాగే కూర్చుంటాడు. ఒంట్లో కొంచెం నలతగా ఉన్నా, తను హైరానపడి, ఇంట్లో వాళ్ళను హైరానపడేసి ఓ ప్రళయం సృష్టిస్తాడు.


"ఏదో జరిగింది! ఇంకేదో జరగబోతూం కనిపించింది" రాఘవమ్మకు! మనస్సులో భయం, ఆందోళన. అన్నం తినాలనిపించలేదు! మౌనంగా అక్కడి నుండి కదిలి వంట ఇంట్లోకి వెళ్ళి తింటూ తింటూ వదలిన కంచం మీద మూత బోర్లించి చెయ్యి కడుక్కొనొచ్చింది! అప్పటికీ భర్తలో మార్పులేదు!

హరినారాయణ తన కోపం, ఆవేశం అదుపులో పెట్టుకొంటున్నట్లు, దవడలు రెండూ పైకీ, కిందికీ కదిలాయి! రాఘవమ్మకు భర్త వాలకం భయం తెప్పించింది. మౌనంగా అతడ్నే చూస్తూ ఉయ్యాల తాళ్ళు పట్టుకొని నిలబడింది! మరో రెండు నిముషాలకు హరినారాయణ మొహం ఎత్తి భార్య కండ్లలోకి చూశాడు! అతని కండ్లు, మొహం ఎర్రగా కందినట్లున్నాయి ఆవేశంతో. "ఏవయిందండీ" రాఘవమ్మ నెమ్మదిగా భర్త కూర్చున్న కుర్చీ దగ్గరకు వచ్చి అడిగింది.

"శ్రీను ప్రతి రోజూ స్కూలుకు వెళ్తు

# విప్పలేని ముడి

వై. నాగవల్లి



ప్రఖ్యాతి చెందిన!
ఖటావ్ మిల్లు వారి
★100% పాలియస్టర్ చీరలు
★ఫుల్‌వాయిల్, ఆఫ్ వాయిల్ చీరలు
★షర్టింగులు, గ్లాసుకో ధోవతులు
★డ్రస్ మెటీరియల్సు, 2x2 రుబియాలాన్సు
★స్కూలు యూనిఫారంలు... వగైరాలకు
విజయ షో రూమ్
ప్రత్యేక ఖటావ్ మిల్లు వస్త్రముల షో రూమ్
J.D. హస్పటల్ రోడ్డు,
గవర్నరుపేట..........విజయవాడ-2.

అందరినీ అలరించే
"జ్యోతి చిత్ర"
చదివి ఆనందించండి!

బ్యాంకింగ్ సర్వీస్
రిక్రూట్‌మెంట్ బోర్డు
పై రిక్రూట్‌మెంట్ బోర్డు వారు జాతీయం చేయబడిన 14 బ్యాంకులలో నున్న 2,694 క్లర్కు పోస్టులను భర్తీ చేయుటకు త్వరలో పరీక్ష నిర్వహించ నున్నారు.
పై పరీక్ష కనుగుణంగా, నమూనా ప్రశ్నా పత్రముల ననుసరించి వ్రాయబడిన ఈ క్రింది పుస్తకము చదివి మీ ధ్యేయమును సాధించండి.
"BANK COMPETITION EXAMS"
for Clerical Cadre
By Dr. S. Lakshmi Narayana
M.A., Ph.D.
ఈ పుస్తకములోని విషయ సూచిక : జనరల్ నాలెడ్జ్, జనరల్ ఇంగ్లీషు, Intelligence & Psychological Tests, Arithmetic, Essays & Letter-Writing
ధర : 12-00 రూ॥లు
అన్ని పుస్తకముల షాపులలో దొరుకును
లేదా వ్రాయండి :
డి. బోస్ & బ్రదర్స్,
3-3-858, కాచిగూడ,
ఆర్యసమాజ మందిర్ ఎదుట,
హైదరాబాదు-500 027.

న్నాడా."అతనికి భార్య ఏం జవాబు చెప్తుం దోనని ఆత్రంగా వుంది. "వాడుస్కూల్లోనే వుంటున్నాడా యిన్నాళ్ళనుంచీ" అనే అనుమానం, ఆశ! అలా అయితేనే ఆ జవాబు వినాలని ఆశ అతనికి!

అసలు ఈ ఆఫీసులకు వెళ్ళే వాళ్ళ అవస్థ పాపం దేవుడికి తెలుసు? పిల్లలు నిద్ర లేవకుండా ఆఫీసుకు వెళ్ళాలి, వాళ్ళు పడుకొనే టైంకు యింటికి చేరాలి! ఒకళ్ళ మొహం ఒకళ్ళు యెన్నాళ్ళకో చూసుకోడం! చంటి పిల్లలయితే గుర్తు పట్టలేక క్రొత్త వాళ్ళనుకుంటారు! అటువంటిది ఇంట్లో జరిగే సంగతులేం తెలుస్తాయి! అందుకే హరినారాయణ అలా అడిగాడు.

"అదేమిటి ప్రతి రోజూ స్కూలుకు వెళ్తున్నాడుగా"

"నిజంగా నేనా! ఇంట్లో ఉండడం లేదా?" రెట్టించాడు.

"బాగుంది! ఇంట్లో ఉండడమేమిటి! స్కూలుకు వెళ్తుంటే"

"ఉహూ! వాడు స్కూలుకు వెళ్ళి ఇరవై రోజులయింది తెలుసా."

ఆమె జవాబు వినగానే హరినారాయణకు మరింత ఆవేశం, బాధ, కోపం కలిగాయి: "ఏవిటీ!" రాఘవమ్మ నోరెళ్ళబెట్టింది, "అదేవిటే ప్రతి రోజూ రిక్షాలోనే వెళ్తున్నాడుగా టైముకు."

"రిక్షాలోనే టైముకు వెళ్తున్నాడు గేటు వరకూ. కాని లోపలికి వెళ్ళడం లేదు." బాధగా అన్నాడు హరినారాయణ.

"లోపలికి వెళ్ళడం లేదా! మరెక్కడికి వెళ్తున్నట్లు, యెక్కడుంటున్నట్లు! ఈ రోజు స్కూల్లో లేడా! సరిగా టైముకు వెళ్ళి టైంకే వస్తున్నాడే మరి."

ఆమెకు భయం, కంగారు కలిగాయి! ఏదో క్రొత్త సంగతి వింటున్నట్లుగా వుంది ఆమెకు. "బడికని వెళ్ళే వాడు యెక్కడికి వెళ్తున్నట్లు" భయంవేసింది. "అసలే పిల్లల్ని యెత్తుకు పోతున్నారంట! వీడేమౌతాడో"ననే భయం, కంగారుతో ఆమెకు చెమటపోసింది.

"అదేమరి అర్థంకాని సంగతి!"

"మీ కెవరు చెప్పారు" బిడియంగా, బింకంగాను అడిగింది. అది నిజం కాదేమో నన్నట్లు "ఎవరో వాడంటే గిట్టని పిల్లలు అలా చెప్పారేమో" ననే ఆశ.

"వాళ్ళ టీచరు చెప్పింది"

"టీచరు చెప్పిందా" గుండెల మీద చెయ్యేసుకొంది. వీడు బడికి వెళ్ళకుండా ఎక్కడికి వెళ్తున్నట్లు! ఏం చేస్తున్నట్లు! ఇలా అయితే వీడి చదువేంగాను? కొడుకు ఈ వయస్సులోనే ఇలా తయారైనందుకు వీడి భవిష్యత్తును తల్చుకొని రాఘవమ్మ గుండె అదిరాయి! "ఇంకా సాయంత్రం వాడొచ్చిన తరువాత ఎంత రభస జరుగుతుందో." మరింత భయంతో పెద్దవిపత్తు వచ్చిపడినట్లు, ఏవీ తోచకుండా కాళ్ళు వణికాయి!

ఆమెకు భర్తకోపం తెలీంది కాదు! ప్రేమగా చూసుకొంటాడు! అసలు కోపం రాదు! కోపంవస్తేమాత్రం మనిషికాడు. బ్రహ్మ రుద్రాదులు వచ్చినా ఆ ఆవేశాన్ని చల్లార్చలేరు! అందుకే కొడుకుని తల్చుకొని మరింత హడిలిపోయింది వాడి గతేం కానున్నదోనని!

"నువ్వు నమ్మలేక పోతున్నావు గదూ! ఎవరైనా చెపితే నేనూ నమ్మేవాడ్నికాదు గాని స్వయంగా టీచరే చెప్పింది. ఈ రోజు స్కూలుకు వెళ్ళానుగా! ఆఫీసులో ఫారం యిచ్చి శీనుకానుకు కూడా చూద్దామని వెళ్ళాను! వాడు లేడు. పిల్లలంతా మీ శ్రీనివాసు రోజూ 'డుమ్మా' కొడుతున్నాడని చెపితే నాకు అర్థంకాలేదు! వాడి క్లాసు టీచరు దగ్గరకు వెళ్ళితే ఆమె చెప్పింది వాడు రావడం లేదని! రిపోర్ట్ కూడా ఇచ్చారట! వాడి రిపోర్ట్‌మాత్రం పూర్తి కాలేదట!! "అంటే" గుడ్లెళ్ళబెట్టుకొని భయంగా అడిగింది రాఘవమ్మ!

"వాడసలు స్కూలుకు వెళితేనే గదా మార్కులు వచ్చేది! క్లాసు పరీక్షలకే రానేదు! ఇహ రిపోర్టేం ఇస్తారు! మనం అడిగితే ఇంకా ఇవ్వలేదని చెప్పాడు వీడు! వేలెడులేడు ఎన్ని అబద్ధాలు, మోసం." పండ్లు కొరికాడు శీనును తల్చుకొని హరినారాయణ.

రాఘవమ్మకు నోటమాట రాలేదు. కొత్త సంగతి, వినరానిది వింటున్నట్లుగా వుంది! అయోమయంలో పడింది! ఏదీ తక్కువ చెయ్యకుండా అన్నీ అమరుస్తుంటే వీడిలా ఎందుకు చేశాడు! వీడి మీద ఎంత నమ్మకముంచారు! వీడెందుకిలా మోసం చేశాడు! ఎవరితోనైనా స్నేహంచేసి ఇలా అయ్యాడా! వీడిప్పుడే ఇలా ఉంటే ఆపైన ఆలోచించడానికి రాఘవమ్మకు భయంవేసింది! ఏదో పెద్ద ఆపద, భరింపరానిది సంభవించినట్లు గిలగిల కొట్టుకుంది మనస్సు.

గంట మూడవుతుంటే రాఘవమ్మకు ఏదో భయం! పగలంతా భర్త మనస్సు, శరీరం అదుపులో పెట్టుకోలేక సతమతమౌతుంటే ఆమెకు కొడుకుమీద కోపం, భర్తమీద జాలివేసినా ఏదో భయం!

మూడున్నర! రిక్షా యింటిముందు ఆగింది! రాఘవమ్మ గుండెల్లో రైళ్ళు పరిగెత్తినట్లయింది భయంతోనూ, కోపం

తోనూ! లాగి రెండు చెంపదెబ్బలు వేద్దామన్నంత ఆవేశం వచ్చింది శీనును చూడగానే కొనిభర్తకండ్లతో వారించాడు! అంతకు ముందే హరినారాయణ హెచ్చరించాడు. "రాఘవా! వీడు రాగానే నువ్వేమీ అనొద్దు! టిఫిను పెట్టు! నేను చూస్తాను నాకు అడ్డు రావద్దు" అని. ఆయన గొంతు కఠినంగా వుండడంతో మౌనంగా తలూపింది. భయంగానే.

"మమ్మీ" శీను రిక్షాదిగి ఇంట్లోకి హుషారుగా వస్తుంటే రాఘవమ్మకు కాళ్లు, గుండెలు వణికాయి, వాడ్నేంచేస్తాడో భర్త అని. మరోవైపు శీనుచేసినపనికి—ఆ పని విన్నప్పటినుండీ తాముపడ్డ ఆరాటం గుర్తుకొచ్చి కోపంవచ్చినా ఊరుకుంది! శీను లోపలికి వచ్చి బూట్లువిప్పి. బట్టలు మార్చుకొని, కాళ్ళూ చేతులూ కడుక్కొనొచ్చి. టిఫిన్ తినేటంతవరకూ హరినారాయణ మౌనంగానే అవతలి గదిలో కూర్చున్నాడు. వాడి ఎదుట తన ఆవేశం పట్టశక్యంకాదని అతనికి తెలుసు! భర్త శాంతం తుఫానుకుముందు నిశ్శబ్దంలాటిదని రాఘవమ్మకు తెలుసు!

శీను టిఫిను తింటున్నంతసేపూ బడిలో జరిగిన సంగతులు చూసినట్లే తల్లితో చెప్తుంటే "వెధవ! వేలెడంత లేడు! ఎన్ని మాటలు నేర్చాడు! ఎంత తెలివిగా చెప్తున్నాడు అన్నీ చూసినట్లే, బడిలో జరిగినట్లే! అసలు సంగతి తెలీకుంటే ఈ మాటలన్నీ నిజమనినమ్మి మురిసిపోయేదే! జరిగిన సంగతి తమకు తెలీదనుకొని హుషారుగా చెప్తున్నాడు అన్నీ కల్పించి. హోరి భడవా! ఎంత తెలివిరా నీది! ఈ తెలివి చదువులోవుంటే" రాఘవమ్మ ఆలోచించింది. శీను తినడం ముగించి బైటికి వెళ్తుంటే హరినారాయణ పిల్చాడు. 'శీను' "ఏవిటి నాన్నా" నవ్వుతూ దగ్గరకువచ్చాడు. వాళ్ళిద్దరినీ చూస్తుంటే పులి. మేకపిల్ల గుర్తుకొచ్చాయి రాఘవమ్మకు. పులని తెలీక దగ్గరకు వెళ్తున్నట్లనిపించింది. రాఘవమ్మ చంటిదాన్ని ఎత్తుకొని గడప దగ్గర కూర్చుంది చూస్తూ!

"నీ పుస్తకాలు ఇలాపట్రా" శీనుకు జరిగింది, జరగబోయ్యేది తెలీదు! అమాయకంగా పుస్తకాల సంచీ తెచ్చి తండ్రి ముందుపెట్టాడు!

"ఈ రోజు హోంవర్కు ఏం లేదా" పుస్తకాలు తిరగేస్తూ అడిగాడు.

పుస్తకాలన్నీ నలిగి వున్నాయి. వాటిలో అంతగా వ్రాసిలేదు. మొదట్లో తప్ప

"హోం వర్కు ఎంలేదు నాన్నా" వాడికి ఆటలకు వెళ్ళాలని తొందర! "హోంవర్కు


శుభవార్త

నాడీ ప్రవీణ, దీర్ఘరోగ నిపుణులు



డా॥ ఎస్. ఎస్. రావు, M.B.H.R.MP

గారిని సంప్రదించండి.

రావూస్ ప్రోడక్ట్సు & క్లినిక్,

ప్లాట్ నెం. 471, మాదాపురం రోడ్‌లో జూబ్లిహిల్సు కో- ఆపరేటివ్ సొసైటి బిల్డింగ్సు, బంజారాహిల్సు ఎక్స్‌టెన్‌షన్.

హైదరాబాద్-500 034 (నాంపల్లి నుండి బస్సు రూట్ '9V')

శరీర బలహీనత, పూబగా పెరుగుటగాని, చిన్నప్పటినుండి ఏ మందువలన లావు కాకపోవుట, అంగములు వుండవలసిన సైజులో వుండకపోవుట, నరముల బలహీనత, మానసిక వ్యాధులు, ఫిట్సు, భయం, గుండెదడ, రక్తప్రసరణ ఎక్కువగావడం లేక తక్కువ గావడం, సర్వవిధములగు దగ్గులు, ఉబ్బసం, పొత్తికడుపు ఎత్తుగా పెరగడం, జలోదరం, కడుపునొప్పి, గ్యాస్టిక్ ట్రబుల్స్, లివర్ జబ్బులు, కడుపులో గాలిచేరుట, స్త్రీల ముట్టు కట్టునొప్పి, కనుమవ్యాధి (ఏ రంగైనా సరే), మూత్రవ్యాధులు, మూలశంఖ. సుఖవ్యాధులు, స్త్రీలకుగాని, పురుషులకుగాని ఒకరిపై ఒకరికి విముఖత, పిల్లలు లేకపోవుట, వీపునొప్పి, నడుము నొప్పి, కీళ్ళ వ్యాధులు, వాపు, నీరు చేరుట, చర్మవ్యాధులు, పుండ్లు, ఎక్కడైనా చర్మము దళసరి ఎక్కుట, బోదవాపు, జ్వరం, పక్షవాతం మొదలైన వ్యాధులు దీర్ఘవ్యాధులుగా పరిణమించినపుడు మాత్రమే వీరు చికిత్స చేయుదురు. తరుణ వ్యాధులు వీరు తీసుకోరు.

సంప్రదించు కాలం : ఉ. 7 గం. నుండి సా. 5 గం. వరకు

పరీక్ష ఫీజు రు. 15/— చికిత్సకు అదనం.

ప్రతినెల క్యాంపులు : 5వ తేదీ కర్నూలు— న్యూ ఉడిపి హోటల్, పెద్ద మార్కెట్‌వద్ద, 6వ తేదీ గుంతకల్— శ్రీలాడ్జి; 7వ తేదీ కడప— ద్వారకాలాడ్జి; 8వ తేదీ తిరుపతి— భీమాస్ అనెక్స్ లాడ్జి; 9, 10 తేదీలు మద్రాస్— కోమల విలాస్, నెం. 5 ఫ్రాన్సి జోసఫ్‌స్ట్రీట్ (జి. టి.) హైకోర్టు ఎదురుగా; 11వ తేదీ నెల్లూరు— రాఘవ విహార్; 12వ తేదీ గుంటూరు— ఉడిపి శ్రీకృష్ణభవన్, స్టేషన్‌రోడ్; 13, 14 తేదీలు రాజమండ్రి— శాంతినివాస్ (మెయిన్‌రోడ్); 15, 16 తేదీలలో వైజాగ్— బృందావన్ లాడ్జి, డాబాగార్డెన్స్; 17వ తేదీ విజయవాడ— మోడరన్‌కేఫ్ లాడ్జి (గాంధీనగర్); 18వ తేదీ ఖమ్మం— మయూర్ కేఫ్, (శేషమహల్ లాడ్జి); 19వ తేదీ వరంగల్-హోటల్ నటరాజ; 20వ తేదీ నుంచి హెడ్డాఫీస్.

N·B : పోస్టుద్వారా సలహా కోరువారు ఫీజు రు. 15/- జవాబుకు పోస్టు బిళ్ళలు పంపవలెను.

SWASTIK

తెల్ల మచ్చల వైద్యం

వైద్యంనుండి చక్కటి ఫలితాన్ని పొందండి



తెల్ల మచ్చల నుండి విముక్తి పొందిన వేలకొలది రోగులు మంది ప్రశంసలు అందిస్తున్నారు. ఇది కాంతి ప్రశంసలు పొందడానికి కారణం ఏమిటంటే ట్రీట్‌మెంట్ మొదలవ్వగానే మచ్చలు యొక్క రంగు మారిపోవడం మొదలవుతుంది. మరియు శీఘ్రంగా చర్మం యొక్క రంగు వచ్చి ఉంటుంది. ఒక్కసారి సేవించిన తరువాత అవి ఎంత తొందరగా పోతాయో చూడండి. నిరాశ చెందిన వేలకొలది రోగులు ఈ తెలు జబ్బు నుండి విముక్తి పొందారు ఇంకా పొందుతూ ఉన్నారు. ప్రచారం కోసం ఒక ప్యాకెట్ మందును ఉచితంగా ఇస్తూ ఉన్నాం. మీరు అనేక విధాలుగా నిరాశ చెంది ఉంటారు ఒక్కసారి దీని చూడండి. తెల్ల మచ్చలు ఎంత పెద్దవో లేదా ఎన్ని రోజుల నుండి ఉన్నాయో మొదలయిన వివరాలు వ్రాయండి.

ఈ వైద్యంకోసం మందును ఎవరైనా చేయవచ్చును విశ్వసనీయమైన ఫలితాన్ని చూచి మొదలెట్టండి. BHARAT AYURVEDASHRAM P. O. KATRI SARAI (GAYA)

## సి ని మా తా ర లు

నేటిమేటి సినీ తారలు శ్రీ దే వి. సుజాత, జయసుధ, జయప్రదల ఫొటోల సెట్టు కావాలంటే 5 రూ॥లు. కేవలం ఒకే ఫొటో కావాలంటే రూపాయిన్నర. పాత కొత్త నటీనటుల, దర్శకుల, రచయితల, సినీ నిర్మాణ సంస్థల అడ్రసులు-ఫోను నెంబర్లుగల పుస్తకం కావాలంటే 2 రూ॥లు ఈ క్రింది అడ్రసుకు మనియార్డరు చేయండి.

వై. కె. మూర్తి,
దాసరివారి వీధి, విజయవాడ-2.



మన్నికకు ప్రసిద్ధిచెందినవి.

# అశోకా పెన్స్ & బాల్ పెన్సు

REGD. No. 143646

అశోకా పాళీలు లాంగ్ లైఫ్ పాయింట్లతో తయారుచేయబడుచున్నవి.

అశోకా పెన్ వర్క్సు, తెనాలి. (ఆంధ్ర)



దీర్ఘ వ్యాధులకు ఉత్తమ వైద్యం!



హస్త ప్రయోగం, అంగము చిన్నదై అవసర కాలమందు అసంతృప్తి, శుక్లనష్టము, నపుంసకత్వము, హెర్నియా, చర్మవ్యాధులు, పోస్టు ద్వారా కూడా వైద్యంచేయబడును. వరిబీజము(బుడ్డ), మూత్ర వ్యాధులు ఆపరేషన్ లేకుండ..రండి.

డా॥ దేవర, ఫోన్ 551,
మార్వాడి గుడివద్ద, తెనాలి.

బ్రాంచి : 5/1, బ్రాడిపేట, గుంటూరు-2



ఉచితం ఉచితం ఉచితం

## తెల్ల మచ్చలు

ఏ రకం తెల్లమచ్చలైనాసరే వాని రంగు మరియు ఎర్రమచ్చలరంగు మా ప్రఖ్యాత ఔషధం "డాగ్ వినాశక్" వాడిన యెడల మూడు దినములలో మారును. అటుపైన మామూలు చర్మంవలె నుండి పోవును. ప్రచారం కొరకు 1 సీసా మందు ఉచితంగా పంపెదము. వెంటనే వ్రాయండి.

Address
**Jeevan Kalyan (B.D-8)**
**(P. O) Katri sarai (Gaya)**


లేదంటే వదుల్తారని ఆశ! "అసలు మా టీచరు రాందే."

"అదేం పాపం" హరినారాయణ అమాయకంగా అన్నాడు.

"ఏమో నాన్నా! జబ్బు చేసిందేమో" చేతులూ, కండ్లు తిప్పుతూ వాడు చెప్తుంటే తెలియని వాళ్లు నిజమేననుకుంటారు! "ఎవరో ఏమిటి తాముమాత్రం అనుకోలేదూ! ఇన్నాళ్ళూ వాడి ఇటువంటి మాటలు నమ్మబట్టేగదా వాడీరోజు ఇలా తయారయ్యాడు" హరినారాయణకి కోపం రెచ్చిపోతూంది. అయినా తమాయించుకున్నాడు!

"ఎన్నాళ్ళనుండీ రావడంలేదురా"

"చాలా రోజుల్నుండీ రావడంలేదు నాన్నా"

"మరి మీకెవరొస్తున్నారు?"

"మా సెక్షను వాళ్ళమంతా 'బి' సెక్షన్ వాళ్ళతో కలిసి కూర్చుంటాం! లేకుంటే మా క్లాసులోనే కూర్చుంటాం కథలు చెప్పుకుంటూ! మా క్లాసుకు నేనే లీడర్ని నాన్నా! నేనే క్లాసంతా నిశ్శబ్దంగా పెడ్తాను." పెద్ద వీరుడిలా అంటుంటే '...రిభడవా' రాఘవమ్మకు కోపం వచ్చింది. 'పెద్ద మొనగాడిలా ఇన్ని మాటలు ఎలా చెప్పగలుగుతున్నాడు వీడు.' ఆశ్చర్యపోయింధి.

"మరి రిపోర్టివ్వలేదురా ఈ నెలకు."

శీను కొంచెం జంకాడు ముందు! ఆ తర్వాత "ఇంకా ఇవ్వలేదు నాన్నా! టీచర్ రాడంలేదుగా" నవ్వాడు.

"అయితే ఈ రోజు బడికే వెళ్ళానంటావ్" ఆ మాటలకు కొంచెం జంకాడు. తండ్రి మాటలు, గొంతు క్రొత్తగా వున్నాయి! "అయినా నాన్నకేం తెలుసు. ఎప్పుడూ స్కూలుకురారుగా" అనే ధీమా శీనులో ధైర్యాన్నిచ్చాయి! "ఎన్నిగంటలకురా మీ స్కూలు"

"తొమ్మిది గంటలకు నాన్నా! తొమ్మిదికి ముందే వుండాలి! అందుకే త్వరగా వెళ్తాను స్కూలుకు! లేకుంటే గేట్లు మూస్తారు!" వాడి మాటలకు హరినారాయణ విస్తుపోయినా, కోపం తారస్థాయినందుకుంది! ఇహ నిలవలేకపొయ్యారు.

"వెధవా! నిజం చెప్పు! ఎక్కడికి వెళ్ళావ్" చెవి మెలి తిప్పారు. "అబ్బా" తండ్రి చెయ్యిమీద చెయ్యివేసి మెలి తిప్పకుండా పట్టుకుంటూ "అవున్నాన్నా స్కూలుకే వెళ్ళాను" శీనుకు భయం బాధవేసినా అంత త్వరగా నిజం ఒప్పుకోడానికి ఇష్టపళ్ళేదు వాడి మనస్సు! "వెధవా! వేలెడంత లేవు అన్నీ అబద్ధాలు! దొంగగాడిద! స్కూలుకు వెళ్ళావా! ఎక్కడికి వెళ్ళావ్ ఇన్నాళ్ళూ! నిజంచెప్పు రాస్కెల్ నిన్ను చంపేస్తాను" బెల్టు వాడి ఒంటిమీద నాట్యంచేసింది.

శీను వొంటిమీద దెబ్బపడని చోటు లేదు! అది చూళ్ళేక రాఘవమ్మ పిల్లను క్రిందవడేసి "ఇంక చాలండీ" అంటూ అడ్డుబోయిన ఆమె వొంటిమీద దెబ్బ పడిందేగాని హరినారాయణ ఆగలేదు! "నువ్వొద్దు రాకు రాఘవా! వీడిప్పటినుండీ యిలా తయారైతే పెద్దయింతరువాత యెంత పెద్ద రౌడీ అవుతాడు! గుండెలు తీసి, తలలుమార్చే రౌడీ ఔతాడు! పనికిరాకుండాపోతాడు! అయినవాళ్ళకు తల వంపులుతెచ్చే ఇటువంటివాడున్నా ఒకటే, చచ్చినా ఒకటే! "పుత్రోత్సాహము పుత్రుడు జన్మింపగానే కాదు, జనులా పుత్రుని కనుగొని పొగడంగ" అన్నారుగాని, నీలాంటివాళ్ళవల్ల మేము సంతోషంకాదు ఏడవాల్సివస్తుంది! అన్నీ అమరుస్తుంటే నీకు పొగరెక్కి ఇలా తయారయ్యావు! దొంగలా తయారయ్యావు! ఎందుకురా నువ్వు బ్రతికి! నిన్ను చంపాలి" హరినారాయణ ఆవేశంతో రెచ్చిపోతూ, మాటకొక దెబ్బగా అలిసిపొయ్యేటంతవరకూ కొట్టాడు.

"ఇంక ఊరొక్కండి! మీ ఆవేశంతో వాడు ఛస్తాడు" తల్లి ఆగలేకపోయింది. భర్త చేతిలోని బెల్టు లాక్కొని శీనును అవతలికి తీసికెళ్ళింది. ఆమెకు గుండె తరుక్కుపోయింది! భర్త మీద కోపం హెచ్చింది. "ఛ! ఛ" హరినారాయణ వరండాలో కెళ్ళి కూర్చున్నాడు! అతని మనస్సు ఇపుడు బాధపడింది వాడ్ని కొట్టినందుకు. శీను ఒళ్ళంతా తట్లు తేలింది! ఏడ్చి ఏడ్చి అలిసి సొమ్మసిల్లినట్లు పడుకున్నాడు. "ఎందుకిలా చేశావురా శీనూ" రాఘవమ్మ వాడ్ని ఒళ్ళోకి తీసుకొని, గుండెల కదుముకుంది. వాడు వెక్కుతూనే జరిగింది చెప్పాడు! "ఓరోజు హోంవర్కు చెయ్యలేదమ్మా! చాలాహోంవర్కువుంది! అన్ని పాఠాల్లోనూ హోంవర్కు యిచ్చారు! చెయ్యలేదు! స్కూలుకు వెళ్తే కొడతారని వెళ్ళలేదు. గార్డెన్‌లో కూర్చున్నాను! అప్పటినుండీ అక్కడికే వెళ్తున్నా."

"ఇంకెప్పుడూ యిలా చెయ్యవుగా"! రాఘవమ్మ ప్రేమగా అడిగింది. "ఉహూ చెయ్యను."

"బాగా చదువుకోవాలి నాన్నా! నువ్వు గొప్పవాడివి కావాలి! అందుకే నిన్ను బడిలో చేర్పించాం ఫీజు ఎక్కువయినా!

నువ్వు చదువుకుంటే నీకే మంచిదినాన్నా! గొప్పవాడివౌతావ్! చదువుకోకుంటే యాదయ్యలా రిక్షాతొక్కుకుంటావా, కూలి పని చేస్తావా! అడుక్కుంటావా! ఇవన్నీ చెయ్యడంనీకిష్టంలేదుమాకిష్టంలేదుఅందుకే చదువుకోవాలినాన్నా! చూడు ఎన్నిదెబ్బలు తిన్నావో!" వాడిని సముదాయించినా రాఘవమ్మకు ఆ దెబ్బలన్నీ తనే తిన్నట్లు ఏడుపొచ్చింది. "నువ్వు గొప్పవాడివి కావాలని నాన్నగారు చూడు నీకు బట్టలు, బూట్లు, పుస్తకాలు అన్నీ తెచ్చారు! నువ్వు ఏం కావాలన్నా ఇస్తారుగదా! మరి నాన్నగారి మనస్సు అలా కష్టపెట్టొచ్చా! నువ్వు బడికి వెళ్ళడం లేదంటె మాకెంత కష్టం తండ్రీ! నువ్వు బాగా చదువుకొని, బుద్ధిమంతుడివైతే ఫలానివాళ్ళబ్బాయని అందరూ గొప్పగా చెప్తుంటే మాకెంత గర్వం, సంతోషం నాన్నా! నువ్వు చెడ్డవాడివని చెప్తుంటే మా కెంత దిగులు కన్నా? అందుకేరా నాన్న కొట్టారు! ఈ దెబ్బలు గుర్తుంచుకుంటావని కొట్టారు! ఇంకెప్పుడూ ఇలా చెయ్యవుగదూ నాన్నా"

"ఉహూ! చెయ్యను" అమ్మ మాటలు విన్న శీనులో కూడా కాస్త పరివర్తన కలిగింది! వాడి మనస్సు బాధపడింది అమ్మను, నాన్నను కష్టపెట్టినందుకు! ఆ లేత హృదయంలో అంతులేని ఆలోచనలు బైటికి చెప్పలేనివి, చెయ్యలేనివి. ఆ చిన్న హృదయంలోని బాధ ఎవరికి తెలుసు? అప్పటికి వాడి మనస్సు సేదదీరలేదు గాని ఏదో బాధ తగ్గినటుగా అనిపించింది. అమ్మ ఒడిలో బావురుమని ఏడుస్తూ అమ్మను చుట్టేశాడు! రాఘవమ్మకు దుఃఖం ఆగ లేదు! వాడ్ని సముదాయించి అన్నం తిని పించి పడుకోబెట్టింది!

"ఎన్ని దెబ్బలు తిన్నాడు చిన్నవెధవ! వాడి భారం, బాధ యెవరికి అర్థం అవుతాయి! దీనిలో తప్పెవరిది! టీచర్లు వాళ్ళ పాఠాలు కాలేదని త్వరత్వరగా చెపారు! పిల్లలు అర్థమయ్యి అవకుండా హోంవర్కు చెయ్యలేరు! ఇచ్చిన నలభై ఐదు నిముషాల్లో యెవరిని చూస్తారు. యెంతని చెపారు టీచర్లు. పిల్లలు క్లాసంతా నిండి వుంటారు. అన్ని సబ్జక్టుల్లోనూ హోంవర్కు యిస్తారు! ఏదని చెయ్యాలి! అసలేం చేస్తారు వాళ్ళ బుర్రలు ఖాళీగావుంటే! చెయ్యకుంటే ప్రతి టీచరు కొడుతుంది. చెయ్యాలంటే సమయమూ లేదు! ఉదయం వెళ్ళి చీకటి పడే వేళకు అలసి ఇంటికొచ్చిన పిల్లలు అన్నం తినగానే నిద్రకు జోగుతారు! పెందలకడ నిద్రపోతేనే ప్రొద్దుటే త్వరగా లేస్తారు! ఇహ చదివేదెవ్వడు, హోంవర్కుచేసేదెవ్వడు! చెయ్యకుంటే తన్నులు! చెయ్యడానికి టైము లేదు. అర్థమవలేదు! అవి భరించలేకనే పిల్లలు ఇలా పారిపోతారు! పారిపోతే తన్నులు. ఎలా జీవించాలి వాళ్ళు! అన్ని కష్టాలూ వాళ్ళకే! ఈ సమస్యకు పరిష్కారం ఎక్కడ? తప్పెవరిది!" అన్నీ పరిష్కారంకాని సమస్యలే కనిపించాయి రాఘవమ్మకు.

"ఇన్నిపుస్తకాలు, పాఠాలకంటె అర్థమయ్యే, జీవితానికి పనికివచ్చే ఒక్కపాఠం చాలదూ. "గంగి గోవుపాలు గంటెడైనను చాలు, కడివెడైననేమి ఖరముపాలు" అన్న పద్యం గుర్తుకొచ్చింది! "ఏం చదువులో" నిట్టూర్చింది. "ఎలా పరిష్కరించాలి ఈ సమస్యను! ఎవరు పట్టించుకుంటారు ఈ బాలల సంగతి." రాఘవమ్మ నిట్టూర్చింది. తనపక్కలో పడుకొన్న శీను ఒంటిమీద చెయ్యివేసి నిమిరింది. అప్పటికి రాఘవమ్మకు ఏదో మనస్సు శాంతించినట్లయింది. శీనును తనపక్కలో పడుకోబెట్టుకున్నందుకు.

మరుక్షణం భర్త గుర్తుకొచ్చాడు. "ఏం చేసున్నారో పాపం! ఆయన! ఆయనకు మాత్రం ప్రేమలేదూ? ఏదో ఆవేశంలో అలా కొటారుగాని" నెమ్మదిగా లేచింది. భర్త గదిలోకి వెళ్ళింది. ఆమె ఊహించినట్లే హరినారాయణ పడుకోలేదు.

"రా! రాఘవా" ఆ గొంతులో బాధ సుళ్ళు తిరిగింది. ఆమె గుండెల మీద తల పెట్టుకున్నాడు. అతనికి తెలుసు ఈ గుండెల మీదనే తను సేదదీరేది అని!

"రెండు హృదయాలు బాధపడుతున్నాయి! ఓదార్చేది ఎవరు! తనేగా" రాఘవమ్మ అనుకుంది.

ఒకరు దెబ్బలు తిని శరీర బాధతోనూ, మరొకరు దెబ్బలు కొట్టి మనస్సు బాధతోనూ. రెండూ భరింపలేని బాధలే! ఓదార్చేది తనేగా.

తల్లిగా కొడుకును ఓదార్చింది ఈ గుండెలమీద! భార్యగా ఇప్పుడు భర్తను ఓదార్చాలి ఈ గుండెలమీద. రాఘవమ్మ కంట్లో నీళ్ళు తిరిగాయి! తనెవరి బాధ చూళ్ళేదు. ఇద్దరి ఓదార్పుల్లోనూ తన బాధ మర్చిపోవాలి. హరినారాయణ ఆలోచించాడు. రాఘవ గుండెలమీద తల పెట్టుకుని. "తప్పెవరిది! ఈనాటి బాలలు రేపటి పౌరులు! వాళ్ళు పౌరులౌతారుగాని గర్వపడే పౌరులుగా ఎంతమంది ఔతారు! అందుకు బాధ్యులెవరు! తప్పెవరిది' గొలుసుకట్టులా ముడి విప్పలేని సమస్య.


శ్రీటెక్స్
ఫ్యాబ్రిక్స్
ఇంటింటి అవసరాలకు...
ఇంటిల్లపాది ఆనందానికి...
శ్రీటెక్స్ దుప్పట్లు
శ్రీటెక్స్ తువ్వాళ్ళు
శ్రీటెక్స్ ఫర్నిషింగ్స్
అందానికి...
ఆకర్షణకి..
మన్నికకు...నమ్మికకు
మేలైన రంగులకు
వాడండి!
Sreetex® SALEM
ఉత్పత్తిదారులు:
ఓ.జి. టెక్స్‌టైల్స్ (ప్రై) లిమిటెడ్.
సేలం-636006